ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# డోంగర్ గావ్‌లో టిబి స్కానింగ్, రక్త పరీక్షలు



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండలంలోని డోంగర్ గావ్ గ్రామంలో టిబి స్కానింగ్, ఉచిత రక్త పరీక్షల కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అబ్దుల్ రెహమాన్ గ్రామంలోని అన్ని వార్డులను సందర్శిస్తూ గ్రామస్తులకు టిబి పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య సిబ్బంది గ్రామస్థులకు ఉచితంగా టిబి స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. టిబి వ్యాధిగ్రస్తులకు చికిత్స పూర్తయ్యేంత వరకు ప్రతినెల రూ.వెయ్యి క్షయ పోషణ భత్యం ప్రభుత్వం అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి, గ్రామ కార్యదర్శి వినోద్ కుమార్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బట్టుపల్లి చౌరస్తా కు మాజీ ఎమ్మెల్యే సమ్మయ్య పేరు



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలో ఉన్న బట్టుపల్లి చౌరస్తాకు మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు కావేటి సమ్మయ్య పేరును ఖరారు చేస్తూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ఆమోదించింది. మున్సిపాలిటీ నెలవారీ కౌన్సిల్ సమావేశంలో భాగంగా ఈ తీర్మానాన్ని ఆమోదించినట్లు కౌన్సిల్ సభ్యులు తెలిపారు. పట్టణ అభివృద్ధి, తెలంగాణ ఉద్యమంలో సమ్మయ్య చేసిన సేవలను గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రాంతీయ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బట్టుపల్లి చౌరస్తాకు కావేటి సమ్మయ్య పేరు పెట్టడం సముచితమని కౌన్సిల్ సభ్యులు అభిప్రాయపడ్డారు.

# పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ రూపవత్ వెంకటరాం సూచించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సామూహిక ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పాల్గొని పశువులకు టీకాలు వేశారు. అనంతరం పశువులను వివిధ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే విధానాలపై పశువైద్యుడు జీవన్ రాథోడ్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువులకు ఏదైనా వ్యాధి సోకినప్పుడు రైతులు నాటు వైద్యం చేయకుండా వెంటనే పశువైద్యులను సంప్రదించి సరైన చికిత్స అందించాలన్నారు. అలాగే మండలంలో నిర్వహిస్తున్న ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వారసంత వేలం




**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైల్వే గేట్ సమీపంలో ఉన్న శనివారం వారసంత వేలం పాటను మంగళవారం నిర్వహించారు. తాండూర్ ఎంపీy అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్ అధ్యక్షతన సంత ఆవరణలో ఈ వేలం కార్యక్రమం ఏర్పాటు చేశారు. 2026–27 సంవత్సరానికి గాను నిర్వహించిన ఈ వేలంలో కూరగాయల మార్కెట్ హక్కులను తాండూర్‌కు చెందిన ఓలపు తిరుపతి రూ.4లక్షల 97వేలకుపైగా వేలం పాట పాడి దక్కించుకున్నారు. అలాగే మేకల మార్కెట్‌ను దేవాపూర్ గ్రామానికి చెందిన ఎల్లబోయిన సతీష్ రూ.11 లక్షలకు వేలం పాట పాడి పొందారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్, మార్కెట్ సంతలకు డిపాజిట్ చేసిన వ్యక్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' పథకం భరోసా

**• జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు కీలకంగా మారిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలలో భాగంగా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం విప్లవాత్మక నిర్ణయమని అన్నారు. పథకం ప్రారంభం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి దాదాపు రూ.10వేల కోట్ల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకం ద్వారా సుమారు 2.55 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకోగా, ఛార్జీల రూపంలో ఆదిలాబాద్ డిపోలో రూ.106 కోట్లు, ఉట్నూర్ డిపోలో రూ.28 కోట్లకు పైగా ఆదా అయ్యిందని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ త్వరలోనే ప్రతి ఎస్‌హెచ్‌జీ మహిళకు హెల్త్ ప్రొఫైల్ రూపొందించనున్నట్లు చెప్పారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు, పీహెచ్‌సీ కేంద్రాల ద్వారా ఈ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే మహిళలు బస్సుల్లో ప్రయాణించడమే కాకుండా స్వయంగా బస్సులు నడిపేలా జిల్లా సమాఖ్యకు ఆర్టీసీ బస్సులను కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పథకం ద్వారా ఆదా అయ్యే డబ్బును మహిళలు తమ కుటుంబ అవసరాలు, పిల్లల విద్య కోసం వినియో గించుకోవాలని సూచించారు. అనంతరం మహిళలు, ట్రాన్స్‌జెండర్ ప్రయాణికులు, ఉద్యోగులను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మెప్మా పీడీ రాజు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డీఎం ప్రతిమ, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్టీసీ, ఇతర శాఖల మహిళా ఉద్యోగులు, ప్రయాణికులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లతో సమన్వయం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తన సమయాన్ని ముందుగా గ్రామ ప్రజల అవసరాలను తీర్చడానికే కేటాయిస్తూ, మిగతా సమయాన్ని వివిధ గ్రామాల పర్యటనకు, సర్పంచ్‌లు సమస్యలను వినడానికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. తనను సర్పంచ్‌గా గెలిపించిన ఇచ్చోడ మండలం బొరిగామా గ్రామ ప్రజలకు తానే ముందుండి సేవలు అందిస్తూ, ఇంటి పెద్ద కొడుకులా గ్రామానికి తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న గ్రామాలకు సేవలు అందించడం గొప్ప విషయం కాదని, పెద్ద గ్రామాల్లో పరిస్థితులు కొంత మేర ఆందోళనకరంగా ఉన్నాయని అన్నారు. వేసవికాలం నేపథ్యంలో ప్రతి గ్రామ సర్పంచ్ ముందుగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఇల్లు, కాలనీలను సందర్శిస్తూ అవసరమైన సౌకర్యాలు కల్పించి ప్రజలకు తగినంత నీరు అందేలా చూడాలని సూచించారు. త్వరలో అధికారులతో కలిసి జిల్లాలోని ప్రతి గ్రామాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల పరిస్థితులపై ఇప్పటికే నివేదికలు తమవద్ద ఉన్నప్పటికీ, రానున్న రోజుల్లో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులతో సమన్వయం చేస్తూ తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని వెల్లడించారు.

# వ్యర్థ పదార్థాల నుంచి ఉపయోగకర వస్తువుల తయారీపై శిక్షణ





**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యర్థ పదార్థాల నుంచి ఉపయోగకరమైన, అలంకరణ వస్తువులు తయారు చేసే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహద పయడతాని తెలిపారు. కళాశాల ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ వ్యర్థ పదార్థాల నుంచి పనికివచ్చే వస్తువులు తయారు చేయడం ద్వారా పర్యావరణ సుస్థిరతను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, వ్యర్థ పదార్థాలను వినూత్న మార్గాల్లో ఉపయోగించుకునేలా విద్యార్థులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం కళాశాల లెక్చరర్ ఎం.రాజేశ్వర్ కాగితాలతో అందమైన కళాకృతులు తయారు చేసే విధానంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు తయారు చేసిన పర్యావరణ హిత వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు డి.జనార్ధన్, డాక్టర్ శారద, నర్సింగ్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్ల షెల్టర్ హోమ్ ఏర్పాటుకు కృషి

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండలంలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా షెల్టర్ హోమ్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆడ వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ సమాజానికి సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, స్వయం ఉపాధి కోర్సులు, ఆర్థిక సహాయం వంటి అంశాల గురించి వారికి వివరించారు. సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు గౌరవ ప్రదమైన స్థానం కల్పించేందుకు, వారికి అవసరమైన మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు అందించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన ట్రాన్స్‌జెండర్ సభ్యులు పాల్గొన్నారు.




# కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట



**ఉద్యమ కెరటం, తాండూర్:** సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని గోలేటి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మాదారం టౌన్షిప్‌లోని కోదండ రామాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో జీఎం దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా జరుగుతున్న సీతారామ కళ్యాణ మహోత్సవం ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనంద దాయకమని అన్నారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో దేవాలయాలను సందర్శించడం ఎంతో మంచిదని సూచించారు. ఇంత మంచి కార్యక్రమానికి హాజరుకావడం తనకు మర్చిపోలేని అనుభూతి అని తెలిపారు. ఆలయ పూజారి అవధూత శర్మ జీఎం విజయభాస్కర్ రెడ్డి దంపతులతో పాటు బెల్లంపల్లి ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్ దంపతులకు వేదమంత్రాలతో ఆశీర్వచనం అం దించారు. ఈ కార్యక్రమాన్ని తిల కించేందుకు సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

